క్లుప్తంగా

విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ

రఘునాథపాలెం: మండలంలోని గణేశ్వర పాఠశాల నుంచి గురుకులంలో 5వ తరగతి ప్రవేశ పరీక్షలకు హాజరవుతున్న 18 మంది విద్యార్థులకు శనివారం పరీక్ష సామగ్రిని ఖమ్మంకు చెందిన మద్రు వెంకటేశ్వరరావు అందించారని పాఠశాల హెచ్‌ఎం విజయ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఫిక్ పాషా, ఎల్.గోపాల్‌రావు, ఎస్.వెంకటేశ్వరరావు, ఎ.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

తిరుమలాయపాలెం: మండలంలోని పాపాయిగూడెంలో వృద్ధాప్యంలో ఒంటరిగా ఉంటున్న యశోద, రాజమణి, ఈశ్వరి కుటుంబాలకు చేగువేరా భూపతి ఫౌండేషన్ ఆధ్వర్యాన రెండు నెలలకు సరిపడా నిత్యావసరాలను శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ చంద్రశేఖర్, సభ్యులు గంట భీమయ్య, జి.సుధాకర్, కొండ సందీప్, జి.రాధిక, రామారావు, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల వ్యాపారికి జరిమానా

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న ఓ పండ్ల వ్యాపారికి మున్సిపల్ అధికారులు జరిమానా విధించారు. 37వ డివిజన్ సందర్శనలో భాగంగా శనివారం పండ్లు విక్రయిస్తున్న ఓ వ్యాపారి వద్ద ప్లాస్టిక్ కవర్లు ఉన్నట్లు గుర్తించిన శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య వ్యాపారికి జరిమానా విధించారు. నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించిన వారికి జరిమానా విధించడంతో పాటు మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అవగాహన సదస్సు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని మామిళ్లగూడెం ప్రభుత్వ పాఠశాలలో సైబర్ క్రైం డీఎస్పీ సీహెచ్‌ఆర్‌వీ ఫణిందర్ ఆధ్వర్యాన సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు ఇతర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఆయా విభాగాల సిబ్బంది ఎం.ప్రసాద్, కిరణ్‌కుమార్, నర్సింహారావులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్ కార్డు తొలగించారని ఫిర్యాదు

నేలకొండపల్లి: రేషన్‌కార్డును అకారణంగా తొలగించారంటూ మండలంలోని బైరవునిపల్లికి చెందిన బాలిన పుష్ప – కృష్ణ దంపతులు తహసీల్దార్ మాణిక్‌రావుకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కలెక్టరేట్ వద్ద దీక్ష చేస్తామని వెల్లడించడంతో విచారణ జరిపిస్తామని తహసీల్దార్ నచ్చచెప్పారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం

ఖమ్మంసహకారనగర్: వరంగల్– ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ శనివారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు మండలాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లకు వెళ్లి ఉపాధ్యాయులు, అధ్యాపకులను కలిసి తనకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. తాను పదవిలో ఉన్నా లేకున్నా ఉపాధ్యాయులు, పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేశానన్నారు. మహిళా టీచర్లకు 90 రోజుల చైల్డ్ కేర్ లీవ్ రావడంలో కీలక పాత్ర పోషించానన్నారు.

బహుమతుల ప్రదానం

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో యువజన సంఘాలకు జిల్లా నెహ్రూ యువక కేంద్రం ఆధ్వర్యాన నిర్వహించిన కబడ్డీ, అథ్లెటిక్స్ జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి శనివారం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువక కేంద్రం అకౌంట్ ఆఫీసర్ కమర్తపు భానుచందర్, వాలీబాల్ కోచ్ ఎండీ అక్బర్ అలీ, జిల్లా సంఘాల సమితి అధ్యక్షులు కె.ఉమాశంకర్, లింగనబోయిన సతీష్, జాగృతి యూత్ అధ్యక్షులు షారుఖ్, వంశీ, ఉషలు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి

ఖమ్మంవన్‌టౌన్: దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని పురస్కరించుకుని నగరంలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యాన మౌలానా చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ గౌస్, గజ్జి సూర్యనారాయణ, బోయిన వేణు, పల్లెబోయిన భారతీచంద్రం, మదూరి ప్రసాద్, బాణాల లక్ష్మణ్, నరాల నరేష్, ఫజల్, జహీర్‌భాయ్, అంజనీకుమార్, బోజెడ్ల సత్యనారాయణ, మదూరి సైదారావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సంక్రాంతికి వస్తున్నాం
వినోద	తండేల్
సాయిరాం	జాబిలమ్మ నీకు అంత కోపమా
ఆదిత్య	డ్రాగన్
శ్రీనివాస	ఛావా
సినీగెలాక్సీ	రామం రాఘవం

– ఖమ్మంగాంధీచౌక్

దర్శనీయం.. సంగమేశ్వరక్షేత్రం


తీర్థాలలోని సంగమేశ్వరాలయం

కోరిన కోర్కెలు తీర్చే తీర్థాల సంగమేశ్వరస్వామి

- ఏళ్ల నాటి ఆలయానికి విశేష ఆదరణ
- మహిమ గల దేవుడిగా భక్తుల నమ్మిక
- ఏటా లక్షల మంది భక్తుల రాక

సండే స్పెషల్

ఖమ్మంరూరల్: కోరిన కోర్కెలు తీర్చే తీర్థాల సంగమేశ్వరస్వామి ఆలయానికి వందల ఏళ్ల చరిత్ర ఉంది. దీంతో ప్రతీ ఏటా నిర్వహించే జాతరకు లక్షల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తరించిపోతుంటారు. ఆలయం పక్కనే గల త్రివేణి సంగమంలో కార్తీక స్నానాలు ఆచరించి శివుని దర్శించుకుంటే ఎంతో పుణ్యఫలం దక్కుతుందని భక్తుల నమ్మకం. దీంతో కార్తీక మాసంలో భక్తులు సంగమేశ్వరున్ని భక్తిశ్రద్ధలతో దర్శించుకుంటుంటారు. భక్తులు కోరిందే తడవుగా తమ కోర్కెలను తీర్చే మహిమ గల స్వామి అని భక్తులు అంటుంటారు.


సంగమేశ్వరస్వామి

ఏళ్లనాటి చరిత్ర..

చరిత్ర ఆధారాల ప్రకారం త్రేతాయుగంలో శ్రీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవానికి శివపార్వతులు వచ్చి తిలకించి తిరుగు ప్రయాణంలో కొంతమంది సప్తరుషులు మార్గ మధ్యలో వెళ్లిపోతారు. ఆతర్వాత త్రిమూర్తులు అనగా మౌదగల్య మహారుషి, ఆత్రేయ మహారుషి, బృగు మహారుషితో కలిసి ప్రయాణిస్తుండగా.. మూడు నదులైన మున్నేరు, ఆకేరు, బుగ్గవాగు కలిసే ప్రాంతం(మున్నేరు) వద్ద శివపార్వతులు కొద్దిసేపు సేదదీరుతారు. ఈప్రాంతాన్నే ఇప్పుడు తీర్థాల గ్రామంగా పేర్కొంటున్నారు. ఈసమయాన శివుడి ఆజ్ఞ మేరకు ఇక్కడ శివలింగాకారాన్ని ఏర్పాటు చేసి సంగమేశ్వరుని ఆలయంగా నామకరణం చేశారు. అనంతరం కీకారణ్యంలో కలిసిపోయింది. ఆతర్వాత ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు బజ్జురు నాగయ్య ఔషధ మూలికల కోసం నది ఒడ్డున మట్టిదిబ్బను తవ్వుతుండగా.. కొన్ని ఆలయాల ఆనవాళ్లు కనిపించాయి. దీంతో గ్రామస్తుల సాయంతో మట్టిదిబ్బ తవ్వించడంతో గోపురం లేకుండా గది మాదిరి నిర్మాణం బయటపడింది. ఆతర్వాత కాలంలో వనంవారి వంశీకులు ఆలయాన్ని వారి ఆధీనంలోకి తీసుకుని సమీపంలో కుగ్రామం ఏర్పాటు చేసి తీర్థాలగా నామకరణం చేశారు.

విరాజిల్లుతున్న ఆలయం..

తవ్వకాలలో గది నిర్మాణాలు బయటపడడంతో రాబోయే కాలంలో ఈ ఆలయం పెద్దక్షేత్రంగా విరాజిల్లుతుందని ముగ్గురు రుషులు చెప్పినట్లు చరిత్ర చెబుతోంది. తాళపత్ర గ్రంథంలో పేర్కొన్న విధంగా ఆలయానికి తూర్పున కుమారస్వామి, పడమరన కాలభైరవుడు, ఉత్తరాన వినాయకుడు, దక్షిణాన ఆంజనేయస్వామిని ప్రతిష్ఠించి ప్రతీ రోజు దీపారాధన చేసేందుకు ఆరడుగల రాతి స్తంభం ఏర్పాటు చేశారు. ఆలయంలో శివలింగం భిన్నంగా ఉండడంతో వేరే పాలరాతి శివలింగం సుమారు 600 ఏళ్ల క్రితం విమాన గోపురాలు, ముఖ మండపం నిర్మాణంతో పాటు దేవస్థానంలో శ్రీనరసింహాస్వామి ఆలయం నిర్మించారు. అప్పటి నుంచి శివుడికి నిత్యం దూప, దీప నైవేద్యాలు సమర్పించడం, మహాశివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

సాగునీటిని వృథా చేయొద్దు

నేలకొండపల్లి: యాసంగి పంటలకు అందించే సాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు బి.సరిత సూచించారు. మండలంలోని రాజేశ్వరపురం, నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెం తదితర గ్రామాల్లో శనివారం పర్యటించారు. తొలుత సాగర్ కెనాల్ వాటర్ సరఫరాను పరిశీలించి అక్కడి రైతులతో మాట్లాడారు. నీటి సరఫరాను షెడ్యూల్ ప్రకారం వినియోగించుకోవాలన్నారు. అనంతరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో స్టాక్‌ను పరిశీలించి పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం నేలకొండపల్లి ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాన్ని తనిఖీ చేసి ఎరువులు విక్రయాలపై ఆరా తీశారు. ఎరువుల విక్రయాల లెక్కలు కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.రాధ, రాజేశ్వరపురం సొసైటీ సీఈఓ వీరబాబు, ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ అసోసియేషన్ నాయకుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సాగర్ కాలువ నీటిని పరిశీలిస్తున్న ఏడీఏ సరిత

మార్చి 10లోగా పనులు పూర్తి చేయాలి

నేలకొండపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు మార్చి 10 కల్లా పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎం.యర్రయ్య సూచించారు. మండలంలోని కట్టుకాచారాం, అప్పలనరసింహాపురం గ్రామాల్లో శనివారం పర్యటించి ఈజీఎస్ ద్వారా చేపట్టిన పనులను పరిశీలించారు. అనంతరం నర్సరీలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పశువుల షెడ్‌ల నిర్మాణాలను శరవేగంగా పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన

కామేపల్లి: మండలంలోని పాన్నేకల్ గ్రామ పంచాయతీ పరిధిలో ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పొందిన 59 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలపై శనివారం జీపీ కార్యాలయంలో అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి మధుసూదన్ మాట్లాడుతూ.. మార్చి 10 లోగా ఇళ్ల నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని, హౌసింగ్ ఇంజనీర్ కొలతలకు తగ్గకుండా లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవాలని, బేస్మెంట్ లెవల్‌కు రూ.లక్ష, స్లాబ్‌కు రూ.2 లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తయ్యాక మిగతా నగదు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ జగ్‌రాం, ఏఈ శ్యామనోహర్, ఎంపీడీఓ రవీందర్, కార్యదర్శి వసంత తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వం

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ ప్రభుత్వం కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాస్తుందని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ విమర్శించారు. శనివారం సంఘం ఆధ్వర్యాన నగరంలో ప్రైవేటు, కార్పొరేటర్ విద్యా సంస్థల విధానాలకు నిరసనగా ధర్నా చేపట్టిన సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు జరుపుతున్నా పట్టించుకోవడం లేదని , అలాంటి విద్యాసంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అధిక ఫీజులు వసూలు చేస్తే ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు వినయ్, శ్రీకాంత్, సందీప్, యశ్వంత్, సాధిక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ఖమ్మంవైద్యవిభాగం/ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏదులాపురం పెట్రోల్ బంక్ క్రాస్‌రోడ్‌లో ఇటీవల గుర్తుతెలియని 30 ఏళ్ల యువకుడు రోడ్డు ప్రమాదంలో మరణించగా.. మృతదేహాన్ని పోలీసులు ఖమ్మం పెద్దస్పత్రికి తరలించారు. మృతదేహం కోసం ఎవరూ రాకపోవడంతో అనాథశవంగా భావించి పోలీసులు, వైద్యశాల సిబ్బంది అన్నం ఫౌండేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో వారు మృతదేహాన్ని బల్లేపల్లిలోని వైకుంఠధామంలో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు,సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న గురువులతో పూర్వ విద్యార్థులు

నగరంలోని వెలుగుమట్ల పార్కులో కొణిజర్ల మండలం సింగరాయపాలెం జెడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు(1998–2003 బ్యాచ్) శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి స్మృతులను నెమరవేసుకుని ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాబురావు, సుబ్బారావు, రామబ్రహ్మచారి, సలాం, మనోజ్, పూర్వ విద్యార్థులు శ్రీనివాసరావు, నర్సింహారావు, నాగరాజు, నర్సింహాచారి, జలీలు, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు. – ఖమ్మం అర్బన్

నగరంలో నేడు..

- **ఖమ్మంరూరల్/తిరుమలాయపాలెం:** రూరల్ మండలంలోని నాయుడుపేటలో ఆదివారం కేవీపీఎస్ పాలేరు డివిజన్ సదస్సు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పి.సంగయ్య తెలిపారు. ఈ విషయమై నాయకులు గుదమళ్లలో శనివారం ఇంటింటి ప్రచారం చేశారు. కేవీపీఎస్ సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ తిరుమలాయపాలెం మండలంలోని పలు గ్రామాల్లో నాయకుడు శ్రీను ఆధ్వర్యాన శనివారం ప్రచారం నిర్వహించారు.
- **ఖమ్మం మామిళ్లగూడెం:** ఖమ్మంలోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం మధ్యాహ్నం మాదిగ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ జె.చంద్రమౌళేశ్వరరావు, బొక్కా దయాకర్, కె.అనిల్ ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

రఘునాథపాలెం/నేలకొండపల్లి: 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ గురుకులాల్లో ఐదు నుంచి తొమ్మిదవ తరగతి ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనేపథ్యాన నేడు(ఆదివారం) ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రవేశ పరీక్ష జరగనుండగా.. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని గిరిజన ప్రతిభా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మల్లెల బాలస్వామి, నేలకొండపల్లి గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.పద్మావతి సూచించారు.

రేపటి నుంచి హరేరామ నామ సంకీర్తన

కామేపల్లి: హరేరామ నామ సంకీర్తన సప్తహం, హరే రామ నామ భగవన్నామాన్ని సంకీర్తనల రూపంలో విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు శ్రీ అవధూతేంద్ర సరస్వతి స్వామి శృతి మందిర వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు భక్త మండలి అధ్యక్షుడు గొట్టుపర్తి శివాజీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24 నుంచి మార్చి 3వ తేదీ వరకు అఖండ హరేరామ నామ సంకీర్తన సప్తహాలు, హనుమాన్ చాలీసా పారాయణం, నగర సంకీర్తన, మహాత్ముల దివ్య ఉపన్యాసాలు జరుగుతాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నాలని కోరారు.

కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా వీరబాబు



ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం నగర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా బత్తుల వీరబాబును నియమిస్తూ ఖమ్మం నగర ఓబీసీ సెల్ చైర్మన్ బాణాల లక్ష్మణ్ ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. ఈమేరకు వీరబాబు కృతజ్ఞతలు తెలిపారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

కామేపల్లి: ఈ నెల 27న నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యాన మండల కేంద్రంలోని కామేపల్లి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఖమ్మం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్ బాబు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక పాఠశాలలోని విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. తహసీల్దార్ సుధాకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కోయచలకలో ట్రెయినీ కలెక్టర్ పర్యటన

రఘునాథపాలెం: మండలంలోని కోయచలక గ్రామంలో ట్రెయినీ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక, ఉన్నత పాఠశాల, హెల్త్ సెంటర్, పశువుల ఆస్పత్రులను సందర్శించారు. అంగన్‌వాడీలో అమలవుతున్న ప్రభుత్వ పథకాల గురించి, చిన్నారులు, గర్భిణులు, బాలింతల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడి కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని హెచ్‌ఎంకు సూచించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి మందులు, వచ్చే బాధితుల గురించి తెలుసుకున్నారు. పశువైద్యశాలలో మందుల వివరాలతో పాటు ప్రభుత్వం అందించే సేవల గురించి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు అందేలా చూడాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు శిరీష, రమాదేవి, మాజీ సర్పంచ్ మాధంబెట్టి హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు రాజ్యలక్ష్మి, నరేష్ లింగరాజు, పశువైద్యుడు రాధాకృష్ణ, అంగన్‌వాడీ టీచర్ వెంకటలక్ష్మి, ఏఎస్‌ఎంసోని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలలో ఆరా తీస్తున్న మ్రిణాల్ శ్రేష్ఠ

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ఖమ్మంరూరల్/నేలకొండపల్లి: ఖమ్మంరూరల్‌మండలంలోని జలగంనగర్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో బదిలీ అయిన పలువురి ఉపాధ్యాయులను శనివారం కాంప్లెక్స్ పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈనేపథ్యాన బదిలీపై ఇక్కడకు వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏఈఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు బదిలీలు సహజమని, విధి నిర్వహణలో విద్యార్థులకు తాము ఏమేరకు బోధించామనేదే ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్యాంసన్, సీహెచ్.ఆనందరావు, రామయ్య, జి.మోహన్‌రావు, జి.సాయిబాబా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే నేలకొండపల్లి మండలం కొనాయిగూడెం పాఠశాల హెచ్‌ఎం పెద్ది జగన్నాథం బదిలీపై వెంకటగిరి వెళ్లగా శనివారం కొండపల్లి ఎంఈఓ కార్యాలయంలో ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు, కాంప్లెక్స్ హెచ్‌ఎం రత్నకుమారి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు టి.గోవిందరావు, సురేష్, బి.శ్రీనివాస్, కోటేశ్వరరావు, భవాని, కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.


ఖమ్మంరూరల్: బదిలీ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

వార్షికోత్సవ వేడుకలు..

- న్యూరిడ్జ్ పాఠశాల..


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న యాజమాన్యం, తదితరులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో న్యూరిడ్జ్ పాఠశాల 10వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖరశర్మలు హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించడం అభినందనీయమన్నారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ కావూరి పద్మావతి, డైరెక్టర్ కావూరి రాజశేఖర్‌లు జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని ప్రారంభించగా.. విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దండా జ్యోతిరెడ్డి, పల్లెబోయిన భారతి చంద్రయ్య, మల్లెంపాటి వెంకటేశ్వర్లు, వైద్యులు మానస, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- విన్‌ఫీల్డ్ హైస్కూల్..


జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో వక్తలు, యాజమాన్యం

నగరంలోని మధురానగర్ విన్‌ఫీల్డ్ సీబీఎస్‌ఈ పాఠశాలలో పదో వార్షికోత్సవ వేడుకలను శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మిక్కిలినేని నరేంద్ర, చావా మాధూరి నారాయణరావు, కూరాకుల వలరాజు, చిరుమామిళ్ల లక్ష్మీ నాగేశ్వరరావు తదితరులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూ భవిష్యత్‌కు మార్గదర్శకంగా నిలపాలన్నారు. అనంతరం పాఠశాల డైరెక్టర్లు గద్దె పుల్లారావు, మన్నె కిషోర్‌కుమార్, పోలవరపు శ్రీకాంత్‌లు మాట్లాడాక.. పోటీ పరీక్షల్లో ప్రతిభ గల విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

కవలల దినోత్సవం

ఖమ్మం సహకారనగర్: అంతర్జాతీయ కవలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నగరంలోని హార్వెస్ట్ పాఠశాల, న్యూవిజన్ పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. హార్వెస్ట్‌లో 37మంది కవలలు ఉండగా.. కార్యక్రమానికి జన విజ్ఞాన వేదిక బాధ్యుడు, ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్ కె.సత్యప్రసాద్ హాజరైనట్లు పాఠశాల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డిలు తెలిపారు. అలాగే న్యూవిజన్‌లో 16 మంది కవలలు విద్యనభ్యసిస్తుండగా వారందరి సమక్షంలో కేక్ కట్ చేసినట్లు ప్రిన్సిపాల్ అబాద్ అలీ తెలిపారు.

‘నారాయణ’లో మాస్టర్ ఓరేటర్ కాంటెస్ట్

ఖమ్మం సహకారనగర్: విద్యార్థుల్లో చిన్నతనం నుంచే స్టేజీ భయం పోగొట్టేందుకు మాస్టర్ ఓరేటర్ కాంటెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నారాయణ పాఠశాలల ఏజీఎం రామ్, ఆర్‌అండ్‌డీ హెడ్ స్వాతిలక్ష్మి, ఆర్ఐ క్రాంతిలు పేర్కొన్నారు. శనివారం ఖమ్మం జోన్ స్థాయిలో నారాయణలో ఈ కంటెస్ట్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్లు, ప్రధానోపాధ్యాయులు రేఖ, అమలోద్భవి, నరసింహారావు, శ్రీనివాస్‌రెడ్డి, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

‘ఎస్‌బీఐటీ’ విద్యార్థులకు ఉద్యోగాలు

ఖమ్మంసహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో కోజెంట్ ఈ–సర్వీసెస్ ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో తమ కళాశాలకు చెందిన 49 మంది విద్యార్థులు ఎంపికై నట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. యాక్సిస్ బ్యాంక్‌కు అనుబంధంగా వర్చువల్ బ్యాంకర్ పోస్టులకు విద్యార్థులకు ఎంపిక చేసినట్లు కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ ప్రదీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఏవీవీ శివప్రసాద్, జె.రవీంద్రబాబు, ఎస్.శ్రీనివాసరావు, టీపీఓ ఎస్.సవిత, కోఆర్డినేటర్ జి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

‘షైన్ ఇండియా’లో సైన్స్ ఎక్స్‌పో


ప్రదర్శనలను తిలకిస్తున్న మేయర్, తదితరులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని షైన్ ఇండియా స్కూల్‌లో శనివారం సైన్స్ ఎక్స్‌పో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ పునుకొల్లు నీరజ, ఫేమా కన్వీనర్ మువ్వా శ్రీనివాసరావు తదితరులు హాజరై ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు సంప్రదాయబద్ధంగా కాకుండా ఆధునిక ఆలోచనలను జోడించి విద్యను అందించాలన్నారు. తర్వాత పాఠశాల చైర్మన్ తాళ్లూరి సృజన్‌కుమార్, కరస్పాండెంట్ ఉషారాణిలు మాట్లాడగా.. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఖమ్మం జిల్లా ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) అధ్యక్షుడు గుర్రం కాంతారావు, కాంగ్రెస్ నాయకుడు శెట్టి రంగారావు పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణలు వెంటనే తొలగించాలి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో లకారం, ధంసలాపురం, ఖానాపురం, వెలుగుమట్ల, మల్లెమడుగు చెరువుల ఆక్రమణలను తక్షణమే తొలగించి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను నిర్ధారించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్, డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని చెరువుల ఆక్రమణను తొలగించి, హద్దులు ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యాన ఆర్డీఓ నరసింహారావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెరువులను ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించి నిర్మాణాలను చెప్పట్టడంతో విస్తీర్ణం తగ్గి వర్షాలు, వరదలు వచ్చినప్పుడు తీవ్రమైన ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతుందన్నారు. జీఓ నంబర్ 58, 59లను అడ్డుపెట్టుకొని ప్రభుత్వ భూములను ఆక్రమించారని, విచారణ చేసి, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మున్నేరు కరకట్ట నిర్మాణంలో ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న వారికి న్యాయం చేయాలని కోరారు. దీనిపై ఆర్డీఓస్పందిస్తూ చెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారని సీపీఎం నేతలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.ఏ.జబ్బార్, ఎస్‌కె.మీరాసాహెబ్, ఖానాపురం హవేలి కార్యదర్శి దొంగల తిరుపతిరావు, రఘునాథపాలెం కార్యదర్శి ఎస్.నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు